RNI NO: APTEL/26/A5325

www.mahinewsindia.com

మహా న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక :134 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజిలు : 4 వెల రూ. 2 శనివారం -31 - అక్టోబర్ - 2026

Published From : Chittoor circulated by YSR Kadapa I Anatapuram I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి: హోం మంత్రి అనిత

ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు.

ఆయా గ్రామాల్లో రోడ్లు వేశామని.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లా, అక్టోబరు 30 : ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఆయా గ్రామాల్లో రోడ్లు వేశామని.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత సుడిగాలి పర్యటన చేశారు. యస్ రాయవరం, పాయకరావుపేట మండలాల్లో పలు గ్రామాల్లో స్థానిక సంస్థల మిగతా..2లో

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని

తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు

కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ

విపక్షాల 'మాక్ పార్లమెంట్' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శ

హైదరాబాద్: మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మిగతా..2లో

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి

2

తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు.

అమరావతి, అక్టోబరు 30 : తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈరోజు (శుక్రవారం) కాకినాడ జిల్లాపై ఆర్నబ్ తుఫాన్ ప్రభావం, సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగంతో, తీర ప్రాంత గ్రామాల ప్రజలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు డిప్యూటీ సీఎం కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.

మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తా..

నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాం

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటించారు.
- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మెట్రేవుల్లో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు.
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటన
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటన

అమరావతి : అర్నబ్ తుపాను మృతులకు 5 లక్షల రూపాయల తక్షణ సాయం అందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విపత్తును ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడం వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించామని చెప్పారు. పునరుద్ధరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్న ముఖ్యమంత్రి, నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మెట్రేవుల్లో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. పునరావాస కేంద్రంలో భోజన వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. అధికారులు తమకు సౌకర్యాలన్నీ కల్పిస్తున్నారని మిగతా..2లో

సీఎం పర్యవేక్షణతో

పెను నష్టం తప్పింది

2లో

- అర్నబ్ తుపాను నష్టంపై అమలాపురంలో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష
- జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఈ రాత్రికే 100 శాతం విద్యుత్ పునరుద్ధరించాలని లక్ష్యం
- తుపానుకు సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు, 36 సబ్‌స్టేషన్లు ధ్వంసం

అమరావతి : అర్నబ్ తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను చక్కదిద్దే పనులను ప్రభుత్వం ముమ్మరం చేసింది. మున్సిపాలిటీల పరిధిలో

విశాఖ పోర్టులో అగ్నిప్రమాదం

2

- నిర్మాణంలో ఉన్న కన్వేయర్ బెల్ట్‌కు అంటుకున్న మంటలు
- వెల్డింగ్ పనుల వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

అమరావతి : విశాఖ పోర్టు ట్రస్ట్ పరిధిలో ఈ మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సీ హార్స్ జంక్షన్ సమీపంలో ఉన్న జేఎం భక్షి కంపెనీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఓ కన్వేయర్ బెల్ట్‌కు మంటలు అంటుకున్నాయి.

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

దేశం కష్టాల్లో ఉంటే కొందరు సంతోషిస్తున్నారు

- దేశానికి అత్యంత బలమైన స్తంభాల్లో అన్నదాతలు ఒకరని ప్రధాని మోదీ అన్నారు.
- గుజరాత్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

ఢిల్లీ : దేశానికి అన్నదాతలే మూల స్తంభాలని, తన చివరి శ్వాస వరకు ప్రజా సేవలో పునరంకితమవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గుజరాత్ లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రధాని ప్రారంభించారు. దీంతో పాటు రూ.14,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 'నా జీవితంలో చివరి క్షణం వరకు ప్రజల సేవలోనే నిమగ్నమై ఉంటాను. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి, కుటుంబంలోని ఏ తరంలోనూ కనీసం పంచాయతీ సర్పంచ్‌గా కూడా ఎవరూ పనిచేయని నేపథ్యం ఉన్న నాకు, మీరు మొదట గుజరాత్‌కు, ఆ తదనంతరం భారతావనికి మిగతా..2లో

యూపీలో మరోసారి అధికారంలోకి వస్తాం

యూసీసీని అమలు చేస్తాం

- ఉత్తరప్రదేశ్‌లో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.
- ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు.

ఢిల్లి : ఉత్తరప్రదేశ్ లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మిగతా..2లో

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

2

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన
- హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు
- వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం
- ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

హైదరాబాద్:రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ

భూములను కాపాడాం

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన

హైదరాబాద్ : మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు మిగతా..2లో

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు

పాల్పడితే ఉపేక్షించం

2లో

- ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ పడేది లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.
- కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు ప్రభుత్వానికి దక్కిన వరుస న్యాయ విజయాలు అని పేర్కొన్నారు.

హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ పడేది లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు ప్రభుత్వానికి దక్కిన వరుస న్యాయ విజయాలు అని పేర్కొన్నారు. కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూల తీర్పు వచ్చిందని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈరోజు (శుక్రవారం) మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు.

మొదటి పేజి తరువాయి

సీఎం పర్యవేక్షణతో పెను నష్టం తప్పింది: మంత్రి అచ్చెన్నాయుడు

ఈ రాత్రిలోగా 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అమలాపురంలోని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో ఆయన తుపాను నష్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అర్నాబ్ తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందునుంచీ నిరంతరం పర్యవేక్షించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని చెప్పారు. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లకుండా ఆపడం వంటి చర్యలు సత్ఫలితాలనిచ్చాయన్నారు. అయితే, విద్యుత్ శాఖకు ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లిందని, జిల్లావ్యాప్తంగా సుమారు 8,000 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 36 సబ్‌స్టేషన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. పునరుద్ధరణ పనులకు అవసరమైన సిబ్బంది, సామగ్రి అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయని తెలిపారు. గురువారం క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి... తక్షణమే తెలంగాణ నుంచి 1,000 మంది సిబ్బందిని రప్పించారని చెప్పారు. అలాగే, తమిళనాడు ప్రభుత్వంతో చర్చించి అక్కడి నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి: హోం మంత్రి అనిత

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌లను చూసి.. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం రోడ్డును పూర్తి చేశామని తెలిపారు. నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్, టాయ్ పార్క్ లాంటి పరిశ్రమలు వచ్చాయని వివరించారు. టాయ్ పార్క్‌తో 25 వేల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పుకొచ్చారు. గోదావరి జలాలు పాయకరావుపేట నియోజకవర్గానికి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికి పట్టం కట్టాలని హోం మంత్రి అనిత కోరారు.

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి

వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని స్పష్టం చేశారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మత్స్యకారుల సమస్యలపై స్వయంగా తాను అధ్యయనం చేస్తానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించం

తాజాగా మియాపూర్ భూముల విషయంలోనూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం వరించిందని తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడుతాం..

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రెవెన్యూ, న్యాయశాఖ, ప్రభుత్వ న్యాయవాదుల మధ్య సమన్వయంతో న్యాయపోరాటం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. పాత భూ రికార్డులు, రెవెన్యూ ఆధారాల పరిశీలనతో ప్రభుత్వ హక్కులను పరిరక్షిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు.. రాష్ట్ర ప్రజల ఉమ్మడి ఆస్తి అని ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. న్యాయపోరాటంలో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులకు మంత్రి అభినందనలు తెలిపారు. భవిష్యతు తరాల ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను కాపాడుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు. సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

విశాఖ పోర్టులో అగ్నిప్రమాదం

ఈ ఘటనతో పోర్టు సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో కన్వేయర్ బెల్ట్‌పై ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగసిపడటంతో పాటు, దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. సమాచారం అందుకున్న వెంటనే విశాఖ పోర్టు ట్రస్ట్ అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కన్వేయర్ బెల్ట్ వద్ద జరుగుతున్న వెల్డింగ్ పనుల కారణంగా చెలరేగిన నిప్పురవ్వలే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై పోర్టు అధికారులు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం - ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాం

మొదటి పేజి తరువాయి

గ్రామస్థులు తెలపగా, ధైర్యంగా ఉండాలని అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం వారికి భరోసా ఇచ్చారు. తుపాను నష్టాలు ఒక్కొక్కటీ పరిష్కరిస్తున్నామన్నారు. బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తామని, బోట్లు కోల్పోయిన మత్స్యకారులను ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం నివారణ : తుపాను తీవ్రతను ముందే గుర్తించి అప్రమత్తం చేయడం వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఇబ్బందులు తప్పాయన్నారు. కూలిన చెట్ల తొలగింపు వేగంగా జరుగుతుందని విద్యుత్ స్తంభాలను చురుగ్గా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ నుంచి వచ్చిన సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో పాలుపంచుకుంటున్నట్లు వివరించారు. రేపు సాయంత్రం లేదా ఎల్లుండినాటికి జిల్లాలో ప్రతి ఇంటికీ విద్యుత్ పునరుద్ధరిస్తామన్నారు. గ్రామాల్లో చివరి వ్యక్తికీ సాయం అందే వరకు పర్యవేక్షిస్తానని చెప్పారు. రూ.4,600 కోట్ల నష్ట

పరిహారం : తుపాను నష్టాన్ని ఇప్పటికే కేంద్రానికి నివేదించామని సీఎం చంద్రబాబు తెలిపారు. కేంద్రమంత్రి అమిత్‌షా సానుకూలంగా స్పందించారని అన్నారు. నిన్న రూ.4,600 కోట్ల నష్ట పరిహారంతో మెమోరాండం పంపించామని తెలిపారు. సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకునేలా ప్రయత్నాలు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తుపాను వర్షాల వల్ల అన్ని రిజర్వాయర్లు నీళ్లతో నిండాయని చెప్పారు. రైతులు పంటలు వేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. విపత్తులో పనిచేసిన ఉద్యోగులందరినీ సీఎం చంద్రబాబు అభినందించారు. కష్టకాలంలో వారందించిన సేవలను ప్రజలంతా గుర్తు పెట్టుకుంటారని అన్నారు. "తుపాను వర్షాల వల్ల అన్ని రిజర్వాయర్లలో నీళ్లు నింపాం. మళ్లీ పంటలు వేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. తుపాను నష్టంపై కేంద్రమంత్రి అమిత్‌షా సానుకూలంగా స్పందించారు. నిన్న రూ.4,600 కోట్ల నష్ట పరిహారంతో మెమోరాండం పంపించాం. తుపాను మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల తక్షణ సాయం. ఇళ్లలో నీళ్లు చేరి పాక్షికంగా దెబ్బతింటే రూ.10 వేలు ఆర్థిక సాయం చేస్తాం. ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల చెరువులు తెగలేదు. తుపాను వల్ల ప.గో. జిల్లాలో కూలిన 12,500 చెట్లను తొలగించాం. ప.గో. జిల్లాలో కూలిన 4,500 విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. రెండు జిల్లాల్లో కొబ్బరి చెట్లు, వరి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులకు సహాయం చేసి ఆదుకునే ప్రయత్నం చేస్తాం."

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా- దేశం కష్టాల్లో ఉంటే కొందరు సంతోషిస్తున్నారు

మొదటి పేజి తరువాయి

సేవ చేసే గొప్ప బాధ్యతను, అవకాశాన్ని అప్పగించారు. నేను సాధించిన ప్రతి విజయానికి, పొందిన ప్రతి పురోగతికి మూలం దేశ ప్రజలే. ఈ దేశ ప్రజల రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. జీవితాంతం వారికి రుణపడి ఉంటాను' అని మోదీ అన్నారు.

విపత్తుల వేళ దుష్ప్రచారం

పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వేళ ప్రతిపక్షాలు అనుసరిస్తున్న వైఖరిపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశం ఏదైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ఆనందించే మనస్తత్వం ఉన్న కొందరు వ్యక్తులు మన మధ్యే ఉన్నారని మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం తలెత్తిన సమయంలో దేశంలో తీవ్రస్థాయిలో ఎరువుల కొరత ఏర్పడుతుందని, వంటగ్యాస్ సరఫరా నిలిచిపోతుందంటూ కావాలని పుకార్లు సృష్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే ఏకైక లక్ష్యంగా ఈ అసత్య ప్రచారాలు చేశారని దుయ్యబట్టారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు ఆకాశాన్నంటినప్పటికీ, ఆ ధరల భారాన్ని భారతీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం ఆ ఖర్చును భరించిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఎరువులు, గ్యాస్ కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "దేశంలోని ప్రతి రైతు, యువకుడు, ఆడబిడ్డ 'వికసిత భారత్' నిర్మాణ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. కానీ దురదృష్టవశాత్తూ ఇది కొందరికి నచ్చటం లేదు. దేశం కష్టాల్లో ఉంటే చూడాలనుకునే వాళ్లు దేశంపైకి ఏదైనా ఆపద వస్తే వారికి ఎంతో ఆనందం. ఇరాన్, గల్ఫ్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధమే దీనికి తాజా ఉదాహరణ. ఈ యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సమైక్యంగా సన్నద్ధమవుతుంటే.. వీళ్లు మాత్రం వదంతులు వ్యాప్తి చేయడంలో బిజీగా ఉన్నారు. కావాలనే తప్పుడు ప్రచారాలు సృష్టించారు. రైతులకు ఎరువులు దొరకవని భయపెట్టారు. కృత్రిమంగా క్యూలైన్లు సృష్టించి వాతావరణాన్ని చెడగొట్టారు. ఇకపై గ్యాస్ సిలిండర్లు దొరకవని మహిళలను భయపెట్టారు. దేశంలో అశాంతి, గందరగోళం సృష్టించడమే వారి లక్ష్యం"

ప్రధాని మోదీ
రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రధాని పునరుద్ఘాటించారు. దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆసరాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 'పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా రూ. 4.5 లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని



పెంపొందించడం, పశుసంవర్ధక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్తేజం అందిస్తున్నామని తెలిపారు. బనాస్కాంత జిల్లా వ్యవసాయ, సహకార రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రధాని ప్రత్యేకంగా మోదీ కొనియాడారు. ఇక్కడి రైతుల శ్రమ, పట్టుదల దేశానికే ఆదర్శమని చెప్పారు. బనాస్కాంత ప్రాంతంలో పండే బంగాళాదుంపలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. ఇక్కడి రైతు వద్దకు వచ్చి 'మేము బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేసి ఇస్తాం' అని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేరన్నారు. ఎందుకంటే, తమ కష్టంతో బంగాళాదుంపల ద్వారా బంగారాన్ని ఎలా పండించాలో ఇక్కడి రైతులకు బాగా తెలుసని చెప్పారు.

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

యూపీలో మరోసారి అధికారంలోకి వస్తాం- యూసీసీని అమలు చేస్తాం

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే దీనిని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని వెల్లడించారు.

మమ్మల్ని ఎవరూ కదిలించలేరు!

ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు. "యూపీలో బీజేపీ ప్రభుత్వం అంగదుడి పాదం (కదిలించలేనిది) లాంటిది. దీనిని ఎవరూ కదిలించలేరు. బీజేపీ మళ్లీ యూపీలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని పేర్కొన్నారు. మరోవైపు సమాజ్ వాదీ పార్టీ ఇకపై యూపీలో అధికారంలోకి రాదని అమిత్ షా అన్నారు. "అఖిలేశ్ బాబూ, గుర్తుంచుకోండి. వచ్చే 30 ఏళ్ల వరకు మీ పార్టీ ఉత్తరప్రదేశ్ లో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ప్రజలు మీ మూడో తరానికి కూడా క్షమించరు" అని అన్నారు. ఈ సందర్భంగా 1990 అక్టోబర్ 30న అయోధ్యలో కరసేవకులపై పోలీసులు జరిపిన కాల్పులను అమిత్ షా ప్రస్తావించారు. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం పోరాడుతున్న కరసేవకులపై సమాజ్ వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులు కాల్పులు జరిపారని ఆయన గుర్తు చేశారు. "నేను (సమాజ్ వాదీ పార్టీ) వారిని అడగాలని అనుకుంటున్నాను. ఏ ప్రాతిపదికన మీరు ప్రభుత్వం ఏర్పాటు గురించి మాట్లాడుతున్నారు? మీరు రామభక్తులపై కాల్పులకు ఆదేశించారు. కానీ మేము రామమందిరాన్ని నిర్మించాం" అని పేర్కొన్నారు.

ఓటు చోరీపై ఏమన్నారంటే?

మరోవైపు విపక్షాలు చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలపై కూడా అమిత్ షా మండిపడ్డారు. వారిని మ్యాచ్ ఓడిపోయిన తర్వాత అంపైర్



ను నిందించే జట్టుతో పోల్చారు. "మ్యాచ్ ఓడిపోయిన తర్వాత, వాళు అంపైర్ ను నిందిస్తున్నారు. ఓట్ చోరీ జరిగిందని ఆరోపిస్తున్నారు. పార్లమెంట్ లో ఈ అంశంపై చర్చకు బీజేపీ సిద్ధంగా ఉంది. ఈ రోజే వచ్చి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోనివ్వండి. మేము ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడానికి సిద్ధంగాఉన్నాం. పార్లమెంట్ లో చర్చ జరగనివ్వండి" అని అన్నారు. కాగా, ఈ రోజు ఉత్తరప్రదేశ్ లోని డాక్టర్ రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అమిత్ షా ప్రారంభించారు. తమ పార్టీ సిద్ధాంతకర్తలైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ , ఉపముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేశ్ పాఠక్ , కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతిపై చర్చ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూసీసీని అమలు చేయాలని పలు రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు పిలుపునిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా కూడా యూసీసీ అమలు గురించి మాట్లాడడం గమనార్హం. ఇటీవల అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ దేశవ్యాప్తంగా యూసీసీ అమలు చేయాలని పిలుపునిచ్చారు. యూసీసీ లేకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతున్న వారిలో ముస్లిం మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. బహుభార్యత్వం లాంటి సమస్యలను పరిష్కరించడానికి ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసోంలో ఇప్పటికే యూసీసీని నోటిఫై చేశామని ఆయన గుర్తు చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ కూడా యూసీసీ ప్రస్తుతం చాలా అవసరమని వ్యాఖ్యానించారు. చట్టంలో ఏకరూపత తీసుకురావడానికి కేంద్ర పౌరస్మృతి ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇటీవల మాట్లాడుతూ, ఉత్తరాఖండ్ , గుజరాత్ ల తరహాలో తమ ప్రభుత్వం 6నెలల్లోగా లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలు ప్రవేశపెట్టి, రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తామని ప్రకటించారు. అంతేకాదు బంగాల్ కోసం ఏకరూప పౌరస్మృతి ముసాయిదాను పరిశీలించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. బంగాల్ సర్కార్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం, యూసీసీ ద్వారా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు సంబంధించిన విషయాల్లో అన్ని వర్గాల వారికి సమానంగా పౌరచట్టాలను వర్తింపజేస్తారు.

బంధం బెడిసికొట్టిన తర్వాత అత్యాచారం కేసు పెట్టలేరు

వ్యక్తిగత సంబంధాలు విఫలమైనప్పుడు వాటిని క్రిమినల్ రంగు పులిమి అత్యాచారం కేసులుగా మార్చడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ప్రేమ లేదా పరస్పర అంగీకారంతో కూడిన సంబంధాలు విఫలమైన తర్వాత, గతంలో సమ్మతితోనే జరిగిన శారీరక సంబంధాన్ని ఆ తర్వాత అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంబంధాలు బెడిసికొట్టిన తర్వాత వాటిని క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి పెరుగుతోందని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. నిజంగా అత్యాచారం, బలవంతం లేదా మోసంతో సమ్మతి పొందిన సందర్భాల్లోనే అత్యాచారం ఆరోపణను పరిశీలించాలని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేస్తూ కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం అభియోగాల నుంచి సుప్రీం కోర్టు విముక్తి కల్పించింది.

సంబంధం విఫలమైతే అత్యాచారం కేసు పెట్టలేరు

జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పరస్పర అంగీకారంతో కొనసాగిన సంబంధంలో శారీరక సాన్నిహిత్యం ఏర్పడిన తర్వాత, ఆ సంబంధం విఫలమైందనే కారణంతో దానిని అత్యాచారంగా చిత్రీకరించలేమని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి కేసుల్ని తాము పదే పదే చూస్తున్నామని, విఫలమైన సంబంధాలు ఆ తర్వాత క్రిమినల్ కేసులుగా మారుతున్న ఈ ధోరణి సమాజంలో పెరిగిపోతోందని, ఇది ఆందోళనకరం అని వ్యాఖ్యానించింది. అత్యాచారం, మోసం అనే రెండు ఆరోపణల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అత్యాచారం తీవ్రమైన నేరం అని, కానీ ఇలాంటి కేసుల వల్ల నిజంగా లైంగిక వేధింపులు,

అత్యాచారానికి గురైన బాధితుల కేసుల తీవ్రత తగ్గిపోతోందని కోర్టు హెచ్చరించింది. గతంలో అంగీకారంతో జరిగిన సంబంధాన్ని, తర్వాత విడిపోయారనే కారణంతో నేరంగా మార్చడం సరికాదని స్పష్టం చేసింది. "పరస్పర సమ్మతితో సాగిన ఒక బంధం విఫలమైనంత మాత్రాన, ఆ తర్వాత కలిగే పశ్చాత్తాపం లేదా కోపం ఆధారంగా ఆ సంబంధాన్ని నేరంగా పరిగణించలేం. ప్రతి విఫలమైన సంబంధాన్ని నేరంగా చిత్రీకరిస్తే, అసలైన లైంగిక దాడి కేసుల తీవ్రత దెబ్బతింటుంది. నిజమైన లైంగిక హింస, భయపెట్టి లేదా మోసం చేసి అత్యాచారం చేసిన సందర్భాలకు మాత్రమే చట్టాన్ని వర్తింపచేయాలి."

- జస్టిస్ బి.వి. నాగరత్న, సుప్రీం కోర్టు న్యాయమూర్తి

పురుషుడికి సంబంధం నుంచి వైదొలిగే హక్కు లేదా?

విడిపోయిన తర్వాత ఒకరి కోపం కారణంగా మరొకరిని నేరస్థుడిగా చిత్రీకరించలేమని ధర్మాసనం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. అలాంటి విధానం నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు ప్రతిష్ఠకు కూడా భంగం కలిగిస్తుందని పేర్కొంది. సమ్మతితో కూడిన బంధంలో ఒకసారి భాగస్వామి అయినంత మాత్రాన, తర్వాతి కాలంలో అత్యాచారం ఆరోపణలు వస్తాయనే భయంతో ఆ పురుషుడు ఆ బంధానికే జీవితాంతం కట్టుబడి ఉండాలని భావించడం సమంజసం కాదని సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఇలాంటి పరిస్థితుల్లో ఆ బంధం నుంచి బయటకు వచ్చే హక్కు పురుషుడికి ఉండదా?' ఆ నిర్ణయాన్ని మోసంగా ఎలా పరిగణిస్తారు? కచ్చితంగా అది మోసం కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పరస్పర అంగీకారంతో కొనసాగిన ప్రతి సంబంధం విఫలమైనప్పుడు దానిని అత్యాచారం ఆరోపణగా మార్చితే, ఆ నేరం తీవ్రత తగ్గిపోతుందని కూడా పేర్కొంది.

కేసు వివరాలు ఇవి

ఈ కేసులో పిటిషనర్ కేరళంకు చెందిన వ్యక్తి. తనపై నమోదైన కేసు నుంచి విముక్తి కోరుతూ ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేరళం హైకోర్టు గతంలో ఆయన డిశ్చార్జ్ పిటిషన్‌ను, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసులో ఫిర్యాదుదారురాలు గతంలో ఒక వ్యక్తిని వివాహం చేసుకొని విడాకులు తీసుకున్నారు. అనంతరం పిటిషనర్‌తో పరిచయం ఏర్పడింది. అయితే తనకు అప్పటికే వివాహమైందనే విషయాన్ని పిటిషనర్ దాచిపెట్టి తనను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని ఆమె ఆరోపించారు. ఆపై తప్పుడు పద్ధతిలో లైంగిక సంబంధానికి తన సమ్మతిని పొందాడని బాధితురాలు ఆరోపించినట్లు ప్రాసిక్యూషన్ కోర్టుకు తెలిపింది. నిందితుడు తనపై అత్యాచారం, మోసం, నమ్మక ద్రోహానికి పాల్పడ్డాడని ఆమె ఆరోపించినట్లు తెలిపింది. కర్ణాటకలోని మైసూరులో తామిద్దరం వివాహం చేసుకున్నామని, ఆ తర్వాత 1996 నుంచి 2003 వరకు కలిసి కాపురం చేశామని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల్ని రద్దు చేస్తూ నిందితుడికి కేసు నుంచి పూర్తిగా విముక్తి కల్పించింది.

30 సాయంత్రం నుంచి సైలెన్స్ పీరియడ్ అమలు..!

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
పోలింగ్ ముగింపునకు 48 గంటల ముందు నుంచే ఎన్నికల ప్రచారంపై నిషేధం
మద్యం విక్రయాలు, ప్రచార కార్యక్రమాలు, బయటి వ్యక్తుల సంచారంపై ఆంక్షలు
ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కడప, మహి న్యూస్ అక్టోబరు 30: జిల్లాలో నవంబర్ 1వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో.. శుక్రవారం (30వ తేదీ) సాయంత్రం 5 గంటల నుండి సైలెన్స్ పీరియడ్ (నిశ్శబ్ద కాలం) అమలులోకి తీసుకురావడం జరుగుతోందని.. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఎన్నికలు ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు నుంచే సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సైలెన్స్ పీరియడ్ లో ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, అందుకు ఎన్నికల సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నవంబర్ 1వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో, అక్టోబరు 30వ తేదీ సాయంత్రం నుంచి ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు నిలిపివేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిశ్శబ్ద కాలంలో బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారాలు, ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి ప్రచార చర్యలకు పాల్పడకూడదని సూచించారు. పోలింగ్ జరిగే మున్సిపల్ ప్రాంతాల్లో ఓటర్లు కాని బయటి వ్యక్తులు ఉండరాదని, స్థానికేతరులు ఆయా ప్రాంతాలలో వుండకూడదన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధం లేని వ్యక్తులు పోలింగ్ జరిగే ప్రాంతాల్లో సంచరించకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

మద్యం దుకాణాలు, మద్యం విక్రయాలు కూడా నిషిద్ధం...

అలాగే పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు నుంచే మద్యం దుకాణాలు, మద్యం విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అన్ని సంబంధిత దుకాణాల యజమానులు తప్పనిసరిగా పాటించాలని, అక్రమంగా మద్యం విక్రయించినా, పంపిణీ చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ వంటి ప్రలోభాలకు పాల్పడరాదని, ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. నిబంధనల అమలుపై పోలీసు, ఎన్నికల అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ గౌరవించి, ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

ప్రకృతి వ్యవసాయంలో ప్రతిభ చాటిన కడప జిల్లా రైతులు..!

గోగుల రాధాకృష్ణ, దండిబోయిన బాలాజీ లకు "కిసాన్ మహారాజ్" అవార్డులు
వరి, కరివేపాకు, పసుపు పంటల సాగులో విశేష ప్రతిభకు గుర్తింపు

కడప, మహి న్యూస్ అక్టోబర్ 30 : సహజ వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగుచేస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్న వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఇద్దరు రైతులకు ప్రతిష్ఠాత్మక "కిసాన్ మహారాజ్" అవార్డులు – 2026 లభించాయి. బద్వేలు మండలం అబుసాహెబ్‌పేటకు చెందిన గోగుల రాధాకృష్ణ, చెన్నూరు మండలం బాలసింగాయపల్లికి చెందిన దండిబోయిన బాలాజీ ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో విష్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన "కిసాన్ మహారాజ్" అవార్డుల ప్రదానోత్సవంలో వీరికి పురస్కారాలు అందజేశారు. సహజ వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ వరి, కరివేపాకు, పసుపు పంటలను విజయవంతంగా సాగుచేయడంతో పాటు సమర్థవంతమైన ఉత్పత్తులు సాధించినందుకు వీరికి ఈ గుర్తింపు లభించింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పందిస్తూ.. సహజ వ్యవసాయ విధానాల ద్వారా పంటల సాగులో ప్రతిభ కనబరిచి జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చిన రైతుల కృషి అభినందనీయం అన్నారు. అంతేకాకుండా జిల్లా వ్యవసాయ శాఖ, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా అధికారుల సేవలను ప్రశంశిస్తూ.. భవిష్యత్తులో సహజ పద్ధతుల ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో జిల్లా రైతులు గణనీయమైన అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు.

జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థుల ముమ్మర ప్రచారం

5, 6, 8, 12, 14 వార్డుల్లో పర్యటించిన పార్టీ నాయకులు

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 30: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. మున్సిపాలిటీలోని 5, 6, 8, 12, 14 వార్డుల్లో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి, భూపేష్ సుబ్బరామిరెడ్డి సోదరి ప్రశాంతి, రాజసింహారెడ్డి కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు మాబువల్లి, చైతన్య, శశికిరణ్, సరోజ, సుజాతలతో కలిసి నాయకులు ప్రజలను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

స్మార్ట్ కిచెన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈవో షంషుద్దీన్

కడప జిల్లా/సిద్ధవటం, మహి న్యూస్, అక్టోబర్ 30: సిద్ధవటంలోని స్మార్ట్ కిచెన్ కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. గురువారం జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి అరుణ, ఏపీఎం సుజాత, ప్రధానోపాధ్యాయురాలు సునీత, స్మార్ట్ కిచెన్ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వేను వారంలోగా పూర్తి చేయాలి

ఆన్‌లైన్ సర్వే 58.89 శాతమే పూర్తి

కడప, మహి న్యూస్, అక్టోబర్ 30: జిల్లాలో కొనసాగుతున్న కుష్ఠు వ్యాధి కేసుల గుర్తింపు సర్వేను వారంలోగా పూర్తి చేయాలని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ వ్యాధుల అధికారి డాక్టర్ ఎస్. రవిబాబు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, డిప్యూటీ పారామెడికల్ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 11 నుంచి ఇప్పటివరకు సర్వే కేవలం 58.89 శాతం మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదైందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో సర్వే వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వైద్యాధికారులు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. వైద్యాధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న అనుమానిత కేసులను వారంలోగా పరిష్కరించాలని, కొత్తగా గుర్తించిన కేసులకు ప్రత్యేక కుష్ఠు వ్యాధి సర్వే నిర్వహించి నివేదికలు పంపాలని సూచించారు. కొత్త కేసులకు నిబంధనల ప్రకారం రిఫాంపిసిన్ ఏకమోతాదు నివారణ చికిత్స అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారిణి డాక్టర్ సౌజన్య, ఫిజియోథెరపిస్టులు డాక్టర్ విక్టర్ మనోహర్, డాక్టర్ గురప్ప, పీఎంఓ సుబ్బరాయుడు, డిప్యూటీ పారామెడికల్ అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే చంద్రబాబు ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం

– గాజుల ఖాదర్ బాషా

రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 30: రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రెండో విడతగా రూ.7 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. రైతుల కష్టాల్లో అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాల కల్పన వంటి పనులు చేపట్టినట్లు వివరించారు. చిన్నమండెం జడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి, గాలివీడు జడ్పీటీసీ అభ్యర్థి సుగవాసి ప్రసాద్ బాబు, సంబేపల్లి జడ్పీటీసీ అభ్యర్థి మల్లు కరుణ తరపున పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా అభ్యర్థులకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని, వారి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగార్జున రెడ్డి, వెంకటరమణారెడ్డి, వాసు, రఫీ, హైదర్, అమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి ఆరోపణలు.. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు డిమాండ్

చిన్నమండెం, మహిన్యూస్, అక్టోబర్ 30: మండలంలోని బోడిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుపై వచ్చిన ప్రవర్తనా ఆరోపణలపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదరు ఉపాధ్యాయుడు విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు, స్థానిక ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆరోపించారు. తాజాగా రెండో తరగతి విద్యార్థిపై దాడి చేసి కొరికినట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇలాంటి ఘటనలతో పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను కులం పేరుతో దూషించినట్లు వచ్చిన ఆరోపణలపైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. తక్షణమే చర్యలు తీసుకుని, పాఠశాలలో ప్రశాంతమైన విద్యావాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ధనకుమార్, వెంకటేష్, లక్ష్మీకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 30 కుటుంబాల చేరిక



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 30: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో తెలుగుదేశం పార్టీకి మద్దతుగా వైఎస్సార్‌సీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జమ్మలమడుగు మున్సిపాలిటీలోని 1వ వార్డు లక్ష్మీనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జగదీష్, శ్రీనివాసులు (మాస్), శ్రీకాంత్, షరీఫ్‌తో పాటు పలువురు మహిళలు టీడీపీలో చేరారు. పార్టీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి బాలకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వంగల నాగేంద్ర యాదవ్, చేరెడ్డి చెన్నకృష్ణారెడ్డితో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన

గాలివీడు:అక్టోబర్30(మహి న్యూస్): సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని గాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. శివభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణ, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతోపాటు మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు సహాయం కోరడం బలహీనత కాదని, అది ధైర్యానికి నిదర్శనమని వివరించారు. కష్టాలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూ, ఒత్తిడిని అధిగమించే మార్గాలను తెలియజేశారు. ఈ ఏడాది కార్యక్రమానికి "నీవు ఒంటరిగా లేవు" అనే సందేశాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించేలా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మానసిక సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఓ. దొరబాబు సహాయం తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మానసిక ఆరోగ్యంపై నినాదాలు రాయించడంతోపాటు సంబంధిత అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం. శివభాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డుమండ ఎంపీటీసీ అభ్యర్థి తుడుము శ్యామలకు ప్రజాదరణ!

నీలంపుట్టు, భారముస్య గ్రామాల్లో విస్తృత ప్రచారం.. ప్రజల నుంచి విశేష స్పందన

అల్లూరి సీతారామరాజు జిల్లా /హుకుంపేట, మహి న్యూస్ అక్టోబర్ 30: హుకుంపేట మండలం గడికించుమండ గ్రామానికి చెందిన అడ్డుమండ ఎంపీటీసీ అభ్యర్థి తుడుము శ్యామల తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచారంలో భాగంగా రెండో రోజు నీలంపుట్టు, భారముస్య గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామస్థులు, మహిళలు ఘన స్వాగతం పలకడంతో పాటు విశేషంగా స్పందించారు.

ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా

ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన తుడుము శ్యామల ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల అవసరాలపై ప్రజలతో చర్చించారు. ఆమె ప్రచారానికి స్థానికుల నుంచి మద్దతు లభించడంతో అనుచరుల్లో ఉత్సాహం నెలకొంది.

అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ఈ సందర్భంగా తుడుము శ్యామల మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అడ్డుమండ సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తనను గెలిపించి ఆశీర్వదిస్తే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. ప్రచారానికి ప్రజల నుంచి లభిస్తున్న స్పందన తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొని ఎన్నికల ప్రచారంలో భాగస్వాములయ్యారు.

పట్టణ ఎన్నికలకు సర్వం సిద్ధం...!

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు
జిల్లాలో 4.39 లక్షల మంది ఓటర్లు.. 560 పోలింగ్ కేంద్రాలు, 335 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
నవంబర్ 1న పోలింగ్.. 3న ఓట్ల లెక్కింపు

కడప, మహి న్యూస్ అక్టోబర్ 30: వైఎస్ఆర్ కడప జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని బోర్డు సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల భద్రత, సిబ్బంది నియామకం, వెబ్‌కాస్టింగ్ తదితర అంశాలను వివరించారు. జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నవంబర్ 1వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కడప నగరపాలక సంస్థతో పాటు బద్వేల్, ఎర్రగుంట్ల, రాజంపేట, పులివెందుల, జమ్మలమడుగు, మైదుకూరు పట్టణాల్లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 4,39,035 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 2,12,807 మంది పురుషులు, 2,25,681 మంది మహిళలు, 547 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. కడప నగరపాలక సంస్థ పరిధిలో అత్యధికంగా 3,07,093 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మొత్తం 345 వార్డులకు గాను 172 వార్డుల్లో ఎన్నికల పోటీ జరగనుంది. మేయర్, చైర్‌పర్సన్ పదవులకు 23 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 313 మంది కలిపి మొత్తం 336 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జమ్మలమడుగులో అత్యధికంగా 28 వార్డులకు 98 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కడపలో మేయర్ పదవికి 15 మంది, 14 వార్డులకు 48 మంది పోటీ పడుతున్నారు. పులివెందులలో చైర్‌పర్సన్ పదవికి ఇద్దరు, 20 వార్డులకు 54 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. రాజంపేటలో 17 వార్డులకు 62 మంది, మైదుకూరులో 15 వార్డులకు 43 మంది, బద్వేల్‌లో ఒక వార్డుకు ఐదుగురు, ఎర్రగుంట్లలో ఒక వార్డుకు ముగ్గురు పోటీలో ఉన్నారని తెలిపారు.

560 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఎన్నికల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 272 ప్రాంతాల్లో 560 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 155 అత్యంత సమస్యాత్మక, 180 సమస్యాత్మక, 225 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు 335 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా 138 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వెలుపల నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు.

3,864 మంది పోలింగ్ సిబ్బంది నియామకం

ఎన్నికల విధుల నిర్వహణకు మొత్తం 3,864 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఇందులో 504 మంది అదనపు సిబ్బంది ఉన్నారు. వీరితో పాటు 208 మంది సూక్ష్మ పరిశీలకులను కూడా నియమించారు. ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ 83.65 శాతం పూర్తి

ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందించే కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. అక్టోబర్ 30వ తేదీ నాటికి 4,39,034 స్లిప్పులకు గాను 3,67,269 స్లిప్పులను పంపిణీ చేశారు. దీంతో 83.65 శాతం పంపిణీ పూర్తయింది. మిగిలిన స్లిప్పులను కూడా త్వరితగతిన పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పోలింగ్ రోజున స్థానిక సెలవు

నవంబర్ 1వ తేదీన పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు స్థానిక సెలవు ప్రకటించారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా వేతనంతో కూడిన సెలవు వర్తిస్తుంది. పోలింగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగించే ప్రభుత్వ, విద్యాసంస్థల భవనాలకు అక్టోబర్ 31, నవంబర్ 3 తేదీల్లో సెలవు ప్రకటించారు. ఎన్నికల నిబంధనల మేరకు అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నిశ్శబ్ద కాలం అమల్లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి శివరామిరెడ్డి, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
తిరుపతి-చిత్తూరు
శనివారం - 31 - అక్టోబర్ - 2026

విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పై అవగాహన



చిత్తూరు జిల్లా గుడిపాల మహి న్యూస్ అక్టోబర్ 30.: చిత్తూరు జిల్లా గుడిపాల మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిళ్లర్ డేవిడ్ రాబిన్ సన్ మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత గురించి వివరించారు . ఈ సంధర్బంగా డేవిడ్ రాబిన్ సన్ మాట్లాడుతూ, ఒత్తిడిని అధిగమించడం , ఏకాగ్రతతో చదవడం , సరైన నిర్ణయాలు తీసుకోవడంలో మానసిక ఆరోగ్యం కీలకమని చెప్పారు . మానసికంగా , ఆరోగ్యం గా ఉన్నపుడే చదువులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు . విద్యార్థులు చదువుతో పాటు తమ మానసిక ఆరోగ్యం పై శ్రద్ద చూపాలని సమస్యలు ఎదురైనపుడు ఆందోళన చెందకుండా ఉపాధ్యాయుల , తల్లిదండ్రుల స్నేహితుల సహాయం తీసుకోవాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

దీపావళి బాణాసంచా దుకాణాలకు భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

నవంబర్ 1లోపు లైసెన్స్ దరఖాస్తులు సమర్పించాలి

నవంబర్ 5వ తేదీ సాయంత్రంలోపు లైసెన్సుల పంపిణీ పూర్తి

చిత్తూరు, అక్టోబర్ 30: (మహి న్యూస్): దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ వెంకటనారాయణ సూచించారు. లైసెన్సుల జారీ ప్రక్రియపై స్థానిక వ్యాపారులతో చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి బాణాసంచా దుకాణానికి మరో దుకాణానికి మధ్య కనీసం మూడు అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. లైసెన్స్ కోసం దరఖాస్తుదారులు మీ సేవ కేంద్రాల ద్వారా చలానా చెల్లించడంతో పాటు జీఎస్టీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. లైసెన్స్ ఎవరి పేరు మీద అవసరమో వారే నవంబర్ 1వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. దుకాణాలు ఏర్పాటు చేయనున్న వ్యాపారులు తమ దుకాణాల ఖచ్చితమైన ప్రాంత వివరాలను సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నవంబర్ 5వ తేదీ సాయంత్రంలోపు లైసెన్సుల పంపిణీ పూర్తి చేస్తామని వెల్లడించారు. డీఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ బాణాసంచా దుకాణాల వద్ద రద్దీ నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో, పెట్రోల్ బంకుల సమీపంలో బాణాసంచా దుకాణాలకు అనుమతులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. మున్సిపల్, పోలీస్ శాఖల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. ఈ సమావేశంలో అగ్నిమాపక శాఖకు చెందిన కరుణాకరన్, మున్సిపల్ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు, చిత్తూరు రూరల్, ఎస్.ఆర్.పురం, పూతలపట్టు, బంగారుపాళ్యం, యాదమరి మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన - జిల్లా కలెక్టర్, ఎస్పీ

ఏర్పేడు ఐఐఎస్ఈఆర్‌లో డీజీపీలు, ఐజీపీల కాన్ఫరెన్స్ ఏర్పాట్ల తనిఖీ

ఏర్పేడు, అక్టోబర్ 30: (మహి న్యూస్): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న డీజీపీలు, ఐజీపీల కాన్ఫరెన్స్ నేపథ్యంలో ఆయన జిల్లా పర్యటనకు సంబంధించి ఏర్పేడు ఐఐఎస్ఈఆర్‌లో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో డీఐజీలు క్రాంతి రాణా టాటా, విశాల్ గున్ని, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ, ఐఐఎస్ఈఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల ఎన్నికల పోలింగ్ సిబ్బంది నియామకానికి మూడో విడత రాండమైజేషన్ పూర్తి

పారదర్శకంగా, నిష్పాక్షికంగా విధుల కేటాయింపు

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



చిత్తూరు, అక్టోబర్ 30: (మహి న్యూస్): చిత్తూరు నగరపాలక సంస్థతో పాటు కుప్పం, పలమనేరు, నగరి మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది నియామకానికి సంబంధించి మూడో విడత రాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం పూర్తి చేశారు. చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల కేటాయింపులో పూర్తి పారదర్శకత, నిష్పాక్షికత పాటించేలా రాండమైజేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఎన్ఐసీ అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాండమైజేషన్ ప్రక్రియను వివరించారు. ఈ ప్రక్రియను డీఆర్వో కె. మోహన్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐసీ డీఐఓ ఎం. వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రధాని మోదీ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

డిసెంబర్‌లో తిరుపతిలో డీజీపీలు, ఐజీపీల సదస్సు వసతి, రవాణా, భద్రత, ఆహార ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, అక్టోబర్ 30: (మహి న్యూస్): డిసెంబర్‌లో తిరుపతిలో నిర్వహించనున్న డీజీపీలు, ఐజీపీల సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రత ఐజీ క్రాంతి రాణా టాటా, డీఐజీ (శిక్షణ) విశాల్ గున్ని, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఇంటెలిజెన్స్ అధికారి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

వసతి, మౌలిక సదుపాయాలపై దృష్టి

సదస్సుకు హాజరయ్యే ఉన్నతాధికారులు, అతిథుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ వసతి గృహాలు, హోటళ్లు, హోమ్‌స్టేల వివరాలు సేకరించి రిజర్వేషన్లు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. భద్రత, రవాణా, రహదారుల నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.

వాహనాల భద్రతా తనిఖీలు తప్పనిసరి

ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రత ఐజీ క్రాంతి రాణా టాటా మాట్లాడుతూ దేశంలోని ఉన్నతస్థాయి అధికారులు, ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రముఖులు సదస్సుకు హాజరయ్యే అవకాశం ఉన్నందున వసతి, రవాణా ఏర్పాట్లలో లోపాలు ఉండకూడదన్నారు. హోటళ్లలో అదనపు గదులు సిద్ధం చేయాలని, ఉన్నతాధికారుల కోసం ప్రత్యేక భోజన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పర్యటనకు వినియోగించే వాహనాలు మంచి స్థితిలో ఉండేలా ఫిట్‌నెస్, బ్రేకులు, ఇతర సాంకేతిక అంశాలను తనిఖీ చేయాలన్నారు. రవాణా, పోలీసు, భద్రతా శాఖలు సమన్వయంతో పనిచేసి వాహనాలకు భద్రతా తనిఖీలు, విధ్వంస నిరోధక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

పార్కింగ్, ఇంధన సదుపాయాలు

హోటళ్ల వద్ద వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు గుర్తించాలని, రాత్రివేళ వాహనాల నిల్వకు తగిన ఏర్పాట్లు చేయాలని ఐజీ సూచించారు. పర్యటన వాహనాలకు నిరంతర ఇంధన సరఫరా కోసం ప్రత్యేక పెట్రోల్ బంకులను గుర్తించాలన్నారు. విమానాశ్రయం నుంచి పర్యటన ప్రాంతాలకు సామగ్రి తరలించేందుకు ట్రక్కులను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రతి శాఖకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించి, రోజువారీ పురోగతిని సమీక్షించాలని, అధికారులు తమ

బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నర్సింహులు, అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, శ్రీలత, రామకృష్ణ, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో మద్యం దుకాణాలు బంద్

అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలపై నిషేధం

అక్టోబర్ 30 సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 1 వరకు అమలు

రీపోలింగ్ జరిగితే నవంబర్ 2న కూడా నిషేధం

నవంబర్ 3న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మద్యం విక్రయాలకు అనుమతి లేదు

చిత్తూరు, అక్టోబర్ 30: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలో అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఎన్నికలు జరిగే మున్సిపల్ ప్రాంతాలతో పాటు వాటి పరిధిలోని 5 కిలోమీటర్ల ప్రాంతంలో మద్యం విక్రయాలపై నిషేధం విధించినట్లు తెలిపారు. అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. నవంబర్ 2వ తేదీన రీపోలింగ్ నిర్వహించాల్సి వస్తే ఆ రోజున కూడా, నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మద్యం విక్రయాలపై నిషేధం కొనసాగుతుందని తెలిపారు. ఈ నిషేధం లిక్కర్ షాపులు, బార్లు, మిలిటరీ క్యాంటీన్లు, టీడీ-1 లైసెన్సులు, కల్లు దుకాణాలు (టీసీఎస్, టీఎఫ్‌టీ), డిస్టిలరీలు, బ్రూవరీలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత మద్యం దుకాణాలు, సంస్థల యజమానులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

మున్సిపల్ ఎన్నికల సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ల మూడవ ర్యాండమైజేషన్ పూర్తి

సాధారణ పరిశీలకులు డా. ఎం. వరప్రసాద్ సమక్షంలో ప్రక్రియ పూర్తి

తిరుపతి కార్పొరేషన్‌తో పాటు నాలుగు మున్సిపాలిటీలకు సిబ్బంది కేటాయింపు



తిరుపతి, అక్టోబర్ 30: (మహి న్యూస్): తిరుపతి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. ఎం. వరప్రసాద్ సమక్షంలో పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. తిరుపతి నగరపాలక సంస్థతో పాటు పుత్తూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో పోలింగ్ నిర్వహణకు పోలింగ్ స్టేషన్ల క్రమంలో సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐసీ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వొద్దు!

అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాలు

ఎన్నికల బందోబస్తుకు పటిష్ట ఏర్పాట్లు: ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

మదనపల్లె, అక్టోబర్ 30, మహి న్యూస్: అన్నమయ్య జిల్లాలో మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. శుక్రవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని నీతి హాలులో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు సన్నద్ధత, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ సిబ్బంది కేటాయింపు, బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బందికి శిక్షణ వంటి అంశాలను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిని గుర్తించాలని, వైద్య సదుపాయాలు, పారిశుధ్య ఏర్పాట్లు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల నియంత్రణ గది నిరంతరం పనిచేయాలని, అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. మదనపల్లె, రాయచోటి, పీలేరు డివిజన్లలో కౌంటింగ్ కేంద్రాలు, బ్యాలెట్ పెట్టెల భద్రత, స్ట్రాంగ్ రూముల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.

ఎన్నికల బందోబస్తుకు ప్రత్యేక చర్యలు

ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి పోలీసు సిబ్బందిని కేటాయించి, ముందస్తుగా పరిస్థితులను పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్ల రాకపోకలు, క్యూల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. మొత్తం 45 పోలింగ్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రతి కేంద్రానికి కనీసం రెండు నుంచి మూడు సంప్రదింపు నంబర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సుమారు 10 త్వరిత స్పందన బృందాలను ఏర్పాటు చేసి, రూట్ల వారీగా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, తనిఖీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళల్లో గస్తీ, తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అదనపు ఎస్పీ వెంకటాద్రి, డీఆర్వో వెంకటేష్, ఆర్డీవోలు శ్రీనివాస్, విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, ఎన్నికల కమిటీల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

పురపాలక ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలపై నిషేధం ఎన్నికల ప్రచారం, బయటి వ్యక్తుల బసపై ఆంక్షలు

ఎన్నికల ప్రచారంపై నిషేధం

మదనపల్లి, మహి న్యూస్, అక్టోబరు 30: అన్నమయ్య జిల్లాలో నవంబరు 1వ తేదీన జరగనున్న పురపాలక ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టబడ్డాయి. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల మూసివేత, ఎన్నికల ప్రచారంపై నిషేధం, సంబంధిత పురపాలక ప్రాంతాల్లో బయటి వ్యక్తుల బసపై ఆంక్షలు తదితర నిబంధనలను కచ్చితముగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీ నిశాంత్ కుమార్, ఐ.ఏ.ఎస్., సంబంధిత అధికారులను ఆదేశించియున్నారు.

మద్యం దుకాణాల మూసివేత

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఆర్.టి.నెం.1286, తేదీ 17.10.2026 మరియు జి.ఓ.ఆర్.టి.నెం.1316, తేదీ 27.10.2026లోని ఆదేశాల మేరకు, ఎన్నికలు జరుగుతున్న సంబంధిత పురపాలక ప్రాంతాల్లో పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటలపాటు మద్యం దుకాణాలను మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. ఈ నిషేధం నవంబరు 1వ తేదీన పోలింగ్ ముగిసే సమయం వరకు అమలులో ఉంటుంది. అదేవిధంగా, నవంబరు 3వ తేదీన ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆ రోజంతా మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించియున్నారు. నిర్దేశించిన నిషేధిత సమయాల్లో మద్యం అమ్మకాలు జరగకుండా ఎక్సైజ్, పోలీసు అధికారులు సమన్వయంతో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించియున్నారు. సంబంధిత లైసెన్సుదారులు, దుకాణాల నిర్వాహకులు మూసివేత సమయాలను తెలియజేసి, ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని సూచించియున్నారు. అక్రమ మద్యం నిల్వలు, రవాణా, పంపిణీ మరియు అమ్మకాలపై నిఘా ఉంచి, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించియున్నారు.

ఎన్నికల ప్రచారంపై నిషేధం

పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల నిశ్శబ్ద కాలంలో బహిరంగ ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులకు తెలియజేయబడింది. ఈ సమయంలో ఎన్నికల బహిరంగ సభలు, ఊరేగింపులు, ర్యాలీలు, మైకుల ద్వారా ప్రచారం తదితర కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేయబడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రచార నిషేధ నిబంధనలను అభ్యర్థులు, రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించాలని ఆదేశించియున్నారు.

ఓటర్లు కాని బయటి రాజకీయ కార్యకర్తలు పురపాలక ప్రాంతాలను విడిచి వెళ్లాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ నెం.112/రాజుజ-ఖీ1/2019, తేదీ 12.03.2019లోని ఆదేశాల మేరకు, ప్రచార గడువు ముగిసిన వెంటనే సంబంధిత పురపాలక సంఘంలో ఓటర్లుగా నమోదు కాని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు మరియు ఎన్నికల ప్రచారం నిమిత్తం వచ్చిన బయటి వ్యక్తులు ఆయా పురపాలక ప్రాంతాలను విడిచి వెళ్లాలని ఆదేశించియున్నారు. ఈ ఆదేశాల అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు సూచనలు జారీ చేయబడ్డాయి. కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లు తదితర ప్రదేశాల్లో బయటి వ్యక్తులకు వసతి కల్పించబడిందా అనే విషయాన్ని తనిఖీ చేయాలని ఆదేశించియున్నారు. లాడ్జీలు, అతిథి గృహాల్లో బస చేస్తున్న వారి వివరాలు, రిజిస్టర్లను పరిశీలించి, సంబంధిత పురపాలక సంఘంలో ఓటర్లు కాని రాజకీయ కార్యకర్తలు, మద్దతుదారులు బస చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించియున్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలపై నిఘా ఉంచాలని, అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు లేదా వ్యక్తుల సమూహాల గుర్తింపును పరిశీలించి, వారు సంబంధిత పురపాలక సంఘంలో ఓటర్లుగా నమోదై ఉన్నారో లేదో నిర్ధారించాలని పోలీసు అధికారులను ఆదేశించియున్నారు.

నిషేధాజ్ఞలను కచ్చితంగా పాటించాలి

ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు జారీ చేయబడిన సెక్షన్ 163 బి.యన్.యస్.యస్ నిషేధాజ్ఞలను ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు వారి అనుచరులు కచ్చితంగా పాటించాలని సూచించియున్నారు. సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రాంతాలు, సమయాలు, షరతుల మేరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. అనుమతి లేని సమావేశాలు, గుంపులుగా చేరడం, శాంతిభద్రతలకు భంగం కలిగించే కార్యక్రమాలకు పాల్పడరాదని ఆదేశించియున్నారు. ఎన్నికల నిబంధనల అమలులో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పోలీసు, ఎక్సైజ్, పురపాలక మరియు ఎన్నికల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించియున్నారు. ఓటర్లు ఎటువంటి భయాందోళనలు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.. నిశాంత్ కుమార్, కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, అన్నమయ్య జిల్లా

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com